ప్రజాశక్తి

సోమవారం 12 ఫిబ్రవరి 2024 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా

ముగిసిన గుణదల మేరీమాత ఉత్సవాలు

వార్త 6లో

ఆదివారం రాత్రి కిటకిటలాడుతున్న గుణదల చర్చి ప్రాంతం

ప్రార్థనా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇండియా నేపాల్ పోప్ వాటికన్ రాయబారి లియోపోర్డో జెరెల్లి

వేసవిలో దాహం తీరేనా!

- ఆర్‌డబ్ల్యుఎస్‌కు విదిలింపులే
- రూ.3 కోట్లు కేటాయించినా ఖర్చు శూన్యం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రజలకు తాగునీటి సరఫరా తమ బాధ్యత కాదన్ననట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. వేసవిలో తరుచూ తాగునీటి సమస్యను ఎదుర్కొనే గ్రామాలకు ప్రత్యామ్నాయ నీటి సరఫరాకు నిధులు కేటాయించడంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడమే దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్క మండలానికి మాత్రమే ప్రత్యామ్నాయంగా నీటి సరఫరాకు నిధులు కేటాయించడం చర్చనీయాంశమైంది. జలజీవన్ మిషన్లో పూర్తికాని పనులను సాకుగా చూపి తరుచూ నీటి ఎద్దడికి గురవుతున్న ప్రాంతాలకు నిధులు కేటాయించలేదు. అంతేగాక గత ఏడాది కేటాయించిన నిధుల్లోనూ ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు.

కృష్ణాజిల్లాలో 266 తాగునీటి చెరువులకు అనుసంధానంగా పిడబ్ల్యూసి స్కీంలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటికితోడు సిపిడబ్ల్యూ స్కీంలు మరో 19 ఉన్నాయి. వేసవికి ముందు ఈ స్కీంలకు అనుసంధానంగా ఉన్న చెరువులను నీటితో నింపినా ఏప్రిల్ చివరి వారం, మేలో వర్షాలు ఆలస్యమైతే జూన్లో పలు గ్రామాల్లో నీటికి కటకట తప్పడం లేదు. సముద్ర తీర ప్రాంతంలోని మచిలీపట్నం, నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ, కృత్తివెన్ను, బంటుమిల్లి తదితర ప్రాంతాలతోపాటు ఆక్వా సాగుతో నీటి కాలుష్యం ఎక్కువగా ఉన్న గుడివాడ రూరల్, నందివాడ తదితర మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి సమస్యను ఎదుర్కొంటారు. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఉప్పగా ఉండటంతో గొంతుతడుపుకోవడానికి పనికిరావు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు ట్యాంకర్లతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటిని సరఫరా చేస్తారు. ఇందుకుగాను గత ఏడాది ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించింది. అయితే ఈ మొత్తంలో ఒక్క రూపాయి కూడా అధికారులు ఖర్చు చేయలేదు. గతంలో కేటాయించిన నిధుల్లో అవసరాన్ని అనుసరించి సమస్య తలెత్తిన గ్రామాలకు నీటిని సరఫరా చేయడానికి కేటాయించిన నిధుల్లో సగానికిపైగా ఖర్చు చేసేవారు.

పూర్తికాని పనులను సాకుగా చూపి కేటాయింపుల్లో కోత

ఇంటింటికీ కుళాయి నీటిని అందిస్తామని చెబుతూ జలజీవన్ మిషన్‌కు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇంకా చాలా ప్రాంతాల్లో ఈ పనులు అసలు ప్రారంభం కాలేదు. వేల కోట్లతో ప్రణాళికలు రూపొందించిన ఈ పనులు త్వరలో ప్రారంభం అవుతాయనే కారణాన్ని చూపుతూ సముద్ర తీర ప్రాంతాల్లోని కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, కృత్తివెన్ను, బంటుమిల్లి, ఆక్వా సాగుతో నీటి కాలుష్య సమస్యతో ఇబ్బంది పడుతున్న గుడివాడ రూరల్, నందివాడ తదితర మండలాలకు నీటి సరఫరాకు ఎటువంటి కేటాయింపులు చేయలేదు. జలజీవన్ మిషన్ పనులు జరగడం లేదనే కారణంతో కేవలం మచిలీపట్నం మండలంలోని 54 శివారు ప్రాంతాలకు రూ.56 లక్షలు మాత్రమే కేటాయించారు.

నగర సమగ్రాభివృద్ధే అజెండాగా ఉండాలి

టాక్స్ పేయర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే వివిధ పార్టీల అభ్యర్థులను సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఎం.వి.ఆంజనేయులు, అధ్యక్షులు వి.సాంబిరెడ్డి అన్నారు. నగరంలోని బుక్‌ఫెస్టివల్ సొసైటీ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎన్నికయ్యే శాసనసభ్యులు పట్టణాల్లో ఆస్తిపన్ను కేపిటల్ విలువకు మారుస్తూ చేసిన చట్టం నెం44/ 2020 రద్దుకు, చెత్తపన్ను వసూళ్ల నిలిపివేతకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఆదాయంలో 40 శాతం స్థానిక సంస్థలకు విధిగా కేటాయించటం, దీనిలో 70 శాతం గ్రామీణ స్థానిక సంస్థలకు, 30 శాతం పట్టణ

(మిగతా 6లో)

కిడ్నీ వ్యాధికి మరొకరు బలి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలం కష్ణారావుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గల మాన్సింగ్ తండాలో శనివారం రాత్రి బరోతు చంద్రు (55) గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మరణించాడు. అయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పిట్టల్లా రాలుతున్నా పట్టని పాలకులు : సిపిఎం

చంద్రు మతదేహాన్ని సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు, నాయకులు పానెం ఆనందరావు (మిగతా 6లో)

పూర్తిస్థాయిలో నవరత్నాలు అమలు

ప్రజాశక్తితో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎన్‌టిఆర్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్ఆర్ క్రాంతి పథం (డిఆర్‌డిఎ) ప్రాజెక్టు డైరెక్టర్ కె శ్రీనివాసరావు పేర్కొన్నారు. వివిధ పథకాల ద్వారా జిల్లాకు మంజూరవుతున్న నిధులను సద్వినియోగపరుస్తూ ఆర్థికంగా ప్రజలు నిలదొక్కుకునే విధంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్ఆర్ పింఛన్ కానుక, బ్యాంక్ లింకేజి, వైఎస్ఆర్ ఆసరా, సున్నా వడ్డీ, ఉన్నతి, స్త్రీ నిధి, వైఎస్ఆర్ చేయూత, జగనన్న తోడు, వైఎస్ఆర్ బీమా, జగనన్న ఇళ్ల కాలనీలు-హౌసింగ్ తదితర పథకాలను అమలు చేస్తూ వాటిని క్షేత్ర స్థాయికి తీసుకెళుతున్నామని చెప్పారు. ఈ పథకాల అమలపై ఆయన ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : సంక్షేమ పథకాల అమలు ఏలా ఉంది ?

గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నాం. వారి ఆర్థిక పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోంది. నవరత్నాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నాం. వైఎస్ఆర్ పింఛన్ కానుక ఈఏడాది జనవరి నుంచి రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచి పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న : వైఎస్ఆర్ పింఛన్ కానుక పరిస్థితి ఏమిటి ?

జిల్లావ్యాప్తంగా 2,27,293 మందికి వైఎస్ఆర్ పింఛను కానుక అందుతోంది. పింఛన్‌దారులకు ప్రతి నెలా పింఛన్ సక్రమంగా అందిస్తున్నాం. వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, చెప్పులు కుట్టేవారు, ఎయిడ్స్ రోగులు...ఇలా వివిధ తరగతుల ప్రజలకు ప్రతి నెలా మొత్తం రూ.68.18 కోట్లను పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న : వైఎస్ఆర్ ఆసరా అమలు తీరు ఎలా ఉంది?

స్వయం సహాయక సంఘాల్లోని మహిళల సంక్షేమం, స్వావలంబన, సాధికారతే ధ్యేయంగా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. స్వయం సహాయక సంఘాల వారు బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించి 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న అప్పు నిల్వ మొత్తాన్నిజిల్లాలో 25,749 సంఘాలకు (2,65,327 మంది సభ్యులు) నేరుగా నాలుగు దఫాలుగా నేరుగా ఆయా సంఘాల

(మిగతా 6లో)

16న పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కాంట్రాక్ట్ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కొండపల్లి హెచ్‌పిసిఎల్ గ్యాస్ కాంట్రాక్టు వర్కర్స్ కీ 8 నెలలుగా పెండింగ్లో ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ తక్షణమే యాజమాన్యం చెల్లించాలని లేని పక్షంలో లేబర్ కమిషనర్ కి ఫిర్యాదు చేస్తామని హెచ్‌పిసిఎల్ గ్యాస్ ప్లాంట్ యాజమాన్యాన్ని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి మహేష్ హెచ్చరించారు. కాంట్రాక్ట్ వర్కర్లని కట్టు బానిసలుగా మార్చి వారికి రావలసిన కనీస ఓటిలు, పెయిడ్ హాలిడేస్, వారాంతపు సెలవులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరుగుతున్న కార్మికుల సమ్మె జయప్రదం కోరుతూ కరపత్రాలు పంపిణీ కార్యక్రమం హెచ్‌పిసిఎల్ గ్యాస్ కాంట్రాక్టు వర్కర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి హెచ్‌పిసిఎల్ గ్యాస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సెక్రటరీ ఆర్ వి ప్రసాద్, ప్రెసిడెంట్ యం జె రత్నం, కోశాధికారి బాబునాయక్, నాయకులు రమేష్, విజయ్, బాలాజీ సురేంద్ర, అనిల్, గోపి, వెంకట్రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

16 వరకు ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు గడువు

ప్రజాశక్తి-నందిగామ: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయములో బిఎ, బికాం, బిఎస్‌సి డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 16 వరకు గడువు ఉన్నట్లు నందిగామ కె.వి.ఆర్ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఏలూరి పిచ్చేశ్వరరావు తెలిపారు. ఇంటర్మీడియట్, ఇంటర్మీడియట్‌కు సమాన అర్హత గల విద్యార్థులు ఈ డిగ్రీ ప్రవేశాలకు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 7382929685కు సంప్రదించాలని కోరారు.

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి-నందిగామ: పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు అందించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి.. హక్కు పత్రాలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్‌తో కలిసి చందర్లపాడు-2 సచివాలయాన్ని సందర్శించారు. గ్రామ సచివాలయం ద్వారా జరుగుతున్న నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. సచివాలయం పరిధిలోని లబ్ధిదారులందరికీ త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ లబ్ధిదారులకు వివిధ లేఅవుట్లలో కేటాయించిన స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు.. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. సచివాలయం ద్వారా అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలను, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్డీవో పి.సాయిబాబు ఉన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని మల్కాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్.బి.కె, వెల్నెస్ సెంటర్, మల్కాపురం - మల్లారం రోడ్డు, కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన తదితర కార్యక్రమాలలో ఎంపి కేశినేని శ్రీనివాస్, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. అలాగే జగ్గయ్యపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, ఆర్ బి కే, వెల్నెస్ సెంటర్లు ప్రతి గ్రామంలో రోడ్ల అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంభోజీ పుల్లారావు, సొసైటీ అధ్యక్షులు జి పిచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.



వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-వీరులపాడు: జుజ్జూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ వారికి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, కోటేరు ముత్తారెడ్డి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు నాగుల్ మీరా, జుజ్జూరు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పూల రాంబాబు, పూల పుల్లయ్య, కొమ్ము మధు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మను దర్శించుకున్న ఇంటెలిజెన్స్ ఐజి

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐజి రఘురాంరెడ్డి అమ్మవారిని ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన బిరుదు శ్రీనివాసరావు రూ.10 వేలు, కృష్ణాజిల్లా కోడూరు గ్రామానికి చెందిన భక్త బృందం పది క్వింటాళ్ల బియ్యం, తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా గుమ్మడి దల గ్రామానికి చెందిన ఒత్తులు శ్రీధర్‌రెడ్డి రూ.11,121 ఆలయ అధికారులకు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎఇఒ తిరుమలేశరావు పాల్గొన్నారు.

కేశినేని చిన్ని పర్యటన

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కేశినేని చిన్ని ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా తోటమూల విగ్రహాల సెంటర్లో చిన్ని మాట్లాడుతూ వైసిపి నుండి ఎంపీగా పోటీ చేయనున్న కేశినేని నాని, ఎమ్మెల్యేగా నల్లగట్ల స్వామిదాసు ఇక ప్రజాక్షేత్రంలో ఉండబోరన్నారు. కట్టలేరు వంతెనకు నిధులు లేకుండా శంకుస్థాపనలు చేసి ప్రజలను మోసం చేసే ప్రయత్నం మళ్లీ చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి, దేవదత్ పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో ఆసిఫ్ ప్రచారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలో గడప గడపకు మన కార్యక్రమంలో భాగంగా 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త షేక్ ఆసిఫ్ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలను వారికి వివరించి రానున్న ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-భవానీపురం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని భవానీపురం పోలీస్ స్టేషన్ సిఐ వి. కృష్ణ తెలిపారు. ఆదివారం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణ రౌడీ షీటర్లతో మాట్లాడుతూ మీరంతా సత్ప్రవర్తనతో మెలగాలని కోరారు. అనవసరమైన గొడవలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. త్వరలో రానున్న ఎన్నికలలో సమావేశాలు, సభల్లో మీరు ఎవ్వరు పాల్గొనకూడదని, రాజకీయ నాయకులు చేసే ర్యాలీలలో కూడా మీరెవరు కనిపించకూడదని, మత్తు పదార్థాలు వినియోగించినా లేక రవాణా చేసినా సహించేది లేదని, మీ అందరిపై పోలీసుల నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని హెచ్చరించారు. ఎవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చట్టం ఎవరికి చుట్టం కాదని ఈ సందర్భంగా భవానీపురం సిఐ వి.కృష్ణ తెలిపారు.

కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ కృష్ణ

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని డివిఆర్ నగర్‌కు చెందిన చావా చందు టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ సమక్షంలో ఆదివారం టిడిపిలో చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తా సురేష్, సామినేని మనోహర్, సిమ్మస్తి వెంకటేశ్వరరావు, నారసాని శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే షేక్ సైదా సాహెబ్ టిడిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం, కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో కట్ల నరసింహారావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే ముస్లిములకు న్యాయం : చిన్ని

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ముస్లింల ఆత్మీయ సమావేశం ఆదివారం పట్టణ సమీపంలోని శుభమస్తు కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొనటానికి వచ్చిన టిడిపి విజయవాడ పార్లమెంటు ఇన్‌ఛార్జి కేశినేని శివనాథ్(చిన్ని)కి ముస్లింలు భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో శాసన మండలి మాజీ స్పీకర్ మొహమ్మద్ షరీఫ్, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీరామ్ రాజగోపాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎన్ని ప్రలోభాలు పెట్టిన, వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసిన రాజధాని కోసం ధైర్యంగా నిలబడిన వ్యక్తి షరీఫ్ అన్నారు. రంజాన్ తోఫా, ఇమామ్ మౌజములకు గౌరవ వేతనం ఇచ్చింది టిడిపి హయాంలోనేనని చెప్పారు. వైసిపి ఈ ఐదు సంవత్సరాల కాలంలో ముస్లిం మైనార్టీల నిధులను మళ్లించి ముస్లిములకు అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు మహమ్మద్ ఫతావుల్లా, ఎంఎస్ బేగ్, జగ్గయ్యపేట మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల వర్ధంతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని కోదాడ రోడ్డులో ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఘంటసాల విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ హడావుడి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి సచివాలయం వద్ద ఆదివారం అలజడి.. మహిళల తోపులాట.. సొమ్మసిల్లిన వద్ధులు.. జగనన్న లేఅవుట్లలో స్థలాలను రిజిస్ట్రేషన్ కోసం వందలాది మంది మహిళలు సచివాలయం వద్దకు చేరుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు నిలువు కాళ్ళ మీద నిలబడాల్సి వచ్చిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో స్థలం రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి టోకెన్ సిస్టం లేకుండా చేయడంతో అందరూ ఎగబడ్డారు. వీఆర్ఏలు పెత్తనం చేస్తూ, తమకు నచ్చిన వారికి దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేయించారని కొంతమంది మహిళలు ఆరోపించారు. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నది. ఆదివారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో సచివాలయం వద్దకు రావడంతో తోపులాట జరిగింది. రెవెన్యూ సిబ్బంది ఆడింది ఆట, పాడింది పాటగా వ్యవహరించారని స్థానికులు చెప్పారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించాల్సిన అవసరం ఉన్నదని కోరారు. కేసరపల్లి సచివాలయం పరిధిలో నాలుగువేల మందికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. కేసరపల్లి తో పాటు వీయన్పురం కాలనీ చెంచుల కాలనీ, దుర్గాపురం పేదలు కూడా అందులో ఉన్నారు. వీరంతా రోజూ పనులు చేసుకునే జీవించే పేదలు. మిగతా రోజుల్లో రావడం కష్టమని ఆదివారం సెలవు కావడంతో వచ్చామని చెప్పారు. రిజిస్ట్రేషన్ పేరుతో తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

కేసరపల్లి సచివాలయం వద్ద గుంపులుగా మహిళలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బుట్టలు, కోళ్లు

సూరంపల్లిలో కోడిపందేలపై దాడి

- రూ.10.50 లక్షల నగదు స్వాధీనం, బైక్‌లు, కార్లు సీజ్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం సూరంపల్లి పామా యిల్ తోటలో భారీ ఎత్తున సాగుతున్న ఆర్గనైజింగ్ కోడి పందాలపై పోలీసులు శనివారం అర్ధరాత్రి దాడి చేశారు. గన్నవరం పోలీసుల సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే.. కష్ణా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, హనుమాన్ జంక్షన్. వీరవల్లి. ఆత్కూరు. గన్నవరం నాలుగు స్టేషన్ల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది కోడిపందాలపై మెరుపు దాడి చేశారు. భారీ సెట్టింగ్ తో రహస్యంగా పామాయిల్ తోటలో కోడి పందాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ దాడిలో 44 మందిని వ్యక్తులు అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి పెద్ద రూ.10.50 లక్షల నగదు, 24 కార్లు, 40 సెల్ ఫోన్లు. సుమారు బైక్ లు 32, పందెం కోళ్ళు సుమారు 54 అదుపులో తీసుకొని గన్నవరం పోలీస్ స్టేషన్ కి తరలించారు. కొన్ని సెల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. గన్నవరం సీఐ ప్రసాద్ కేసు నమోదు చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ, సస్పెక్ట్ లను పోలీస్ స్టేషన్లో ఎస్సై సందీప్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రాబోవు ఎన్నికల దష్ట్యా ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామని, మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలకు గాని, రాజకీయ విద్వేషాలు, రెచ్చగొట్టి గొడవలు చేయటం గాని చేస్తేకఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఏవైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగేతే తెలియజేయాలని ఎస్ఐ అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నేడు కలెక్టరేట్లో 'స్పందన'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.అలాగే డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ సూచించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి : కాపు సంక్షేమ సేన అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షులు, లలితా దేవి చారిటబుల్ ట్రస్టు ట్రస్టీ అయిన ముమ్మారెడ్డి వెంకట కష్ణారావు మనుమరాళ్లు చర్విత, హన్సుజా ల పుట్టిన రోజు సందర్భంగా మోపిదేవి లోని గిరిజన కాలనీలో యానాదులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు భోగిరెడ్డి సాంబశివరావు, మెరకనపల్లి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు యర్రంశెట్టి సునీల్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అవనిగడ్డ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, మోపిదేవి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు పర్చూరి కేశవ, కామిశెట్టి శ్రీనివాసరావు, వీర మహిళ కేతరాజు వల్లి, గరికిపాటి కష్ణ ప్రసాద్, కూరేటి జగన్, చవాకుల్ సురేష్, కోసూరి సీతా రామాంజనేయులు పాల్గొన్నారు

చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

చెవిలో పూలతో నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ : ముఖ్యమంత్రి జగన్మోహన్ అధికారంలోకి రాకముందు ఐదు సంవత్సరాల క్రితం ప్రత్యేక హెూదా అడిగి ఆంధ్రప్రదేశ్ ప్రజల చెవిలో పువ్వులు పెట్టారని విమర్శిస్తూ చెవిలో పువ్వులు పెట్టుకొని టిడిపి నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. ఆదివారం అవరగడ్డ రాజీవ్ గాంధీ సెంటర్లో చెవిలో పువ్వులు పెట్టుకొని జగన్మోహన్ రెడ్డి ఫోటోతో నిరసన తెలిపారు. 2019 సంవత్సరం ఎలక్షన్ ముందు 25 మంది ఎంపీలు ఇస్తే కేంద్రం మెడలు వచ్చి ప్రత్యేక హెూదా తెస్తానని ప్రగల్భాలు పలికాడన్నారు. ఆంధ్రప్రదేశ్లో 22 మంది ఎంపీలు 150 యొక్క మంది ఎమ్మెల్యేలను ప్రజలు ఇచ్చారని, గడచిన ఐదు సంవత్సరాలగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రధానమంత్రిని కేంద్ర మంత్రులను ఢిల్లీ వెళ్లి అనేక పర్యాయాలు కలిసినా ఒకసారి కూడా ప్రత్యేక హెూదా గాని రాజధానికి నిధులు కానీ పోలవరానికి నిధులు కానీ అడగలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బం డే రాఘవ, లక్ష్మీనారాయణ, బచ్చు రఘునాథ్, మండలి రామ్మోహన్రావు, కొట్టే విజయ్ లుక్కా శ్రీనివాసరావు, ఎలవర్తి చిన్న, గుంటూరు వినయ్, బడే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెడన : విజయవాడ హెల్ప్ హాస్పటల్ సౌజన్యంతో లివింగ్ రాక్స్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని కౌన్సిలర్ కటకం ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సతీష్ బాబు, బాబూలాల్, లివింగ్ రాక్ మినిస్ట్రీస్ పాస్టర్ పస్తం సల్మాన్ రాజు, చర్చి విశ్వాసులు పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. దూర ప్రాంతాల నుండి సుమారు 20వేల మంది భక్తులు ఆదివారం అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులు తీర్చుకున్నట్లు తెలిపారు. దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలుగకుండా దర్శనం చేసుకునేందుకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి ఏర్పాట్లు పరిశీలించినట్లు తెలిపారు.

నారాయణమూర్తి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఎఎఎన్ఎమ్ అండ్ వివిఆర్ఎస్అర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, పాలిటెక్నిక్ వ్యవస్థాపక అధ్యక్షులు అడ్సుమిల్లి అశ్వర్ధ నారాయణ మూర్తి 37వ వర్ధంతి ఆదివారం పాలిటెక్నిక్ ఆవరణలో ఘనంగా జరిగింది. మేనేజింగ్ ట్రస్టీ కొడాలి వెంకట కష్ణారావు అధ్యక్షత జరిగిన సంస్మరణ సభలో అడ్సుమిల్లి అశ్వర్ధనారాయణమూర్తి విగ్రహానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్సుమిల్లి అశ్వర్ధనారాయణమూర్తి సేవలు చిరస్మరణీయమని ఆయన ఆశయాలు, కార్యాచరణ, వ్యక్తిత్వము నేటి యువతకు మార్గదర్శకాలు అన్నారు. ఆయన స్థాపించిన ఈ పాలిటెక్నిక్ ద్వారా ఎంతోమంది విద్యార్థులు విద్యను అభ్యసించి తద్వారా ఉపాధి పొంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. అడ్సుమిల్లి అశ్వర్ధనారాయణమూర్తి ప్రైవేట్ ట్రస్ట్ ద్వారా గుడ్లవల్లేరులోని పేద రోగులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలియజేసారు. 21 మంది నిరుపేద స్త్రీ, పురుషులకు ఒక సంవత్సరకాలం అందించే 3 వందల రూపాయలు నెలసరి జీవన భతి అలాగే స్థానిక వైద్యులు సిఫారసు చేసిన ఆరుగురు నిరుపేద రోగులకు ఒక్కొక్కరికి 15 వందల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ట్రస్టీలు కొడాలి.వెంకట కష్ణారావు, ఉప్పలపాటి సత్యనారాయణ, పొట్లూరి వెంకట రావు,అడ్సుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు , వల్లూరుపల్లి రామకష్ణ , గ్రామ ప్రముఖులు జంగం మోహనరావు ,సూరపనేని పరంధామయ్య ,పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ , పాలిటెక్నిక్ అకడమిక్ డెవల ప్మెంట్ కో-ఆర్డినేటర్ జి.వి.వి.సత్యనారాయణ, కాలేజ్ ప్రిన్సిపాల్ డా.బి.కరుణ కుమార్ పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

గుడ్లవల్లేరు మండలంలో టిడిపిలో చేరుతున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము సమక్షంలో మండలంలోని డోకిపర్రు గ్రామ ప్రముఖులు, వైసిపి నాయకులు టిడిపి పార్టీలోకి ఆదివారం చేరారు. గ్రామ వైసిపి మాజీ వైస్ సర్పంచ్ పురిటిపాటి సుబ్బారావు, ఆరుగురు పంచాయతీ సభ్యులు,పెద్ద సంఖ్యలో వైసిపి కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి, డోకిపర్రు వైసిపి నేతలను టిడిపిలోకి వెనిగండ్ల రాము ఆహ్వానించారు.మండల పార్టీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి , వల్లబనేని వెంకట్రావు , ఈడే కష్ణ రావు, పార్టీలో చేరిన డోకిపర్రు పంచాయతీ సభ్యులు 1వ వార్డు సభ్యులు కిలారపు వెంకటేశ్వరరావు ,13వ వార్డు సభ్యులు కోనకాల భానుమతి,8వ వార్డు సభ్యులు పడమట ప్రకాష్ ,14వ వార్డు సభ్యులు పిల్లి నాగమణి ,సోమగాని సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్:: వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే సమయంలో ఆసన్నమైందని గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ విజయవాడ రోడ్డులో మండల అధ్యక్షుడు దయ్యాల రాజేశ్వరరావు అద్యక్షతనలో జరిగిన సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. యార్లగడ్డ వెంకట్రావు నాయకత్వాన్ని బలపరుస్తూ బాపులపాడులోని పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. వైసీపీ యూత్ ప్రెసిడెంట్ కర్రా ప్రసాద్బాల్, బాపులపాడు గ్రామ పంచాయతీ 2వ వార్డు సభ్యుడు కడవకొల్లు నాగరాజు, 12వ వార్డు సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, కడవకొల్లు రాజేష్, కంచర్ల సత్యన్నారాయణ, రామన్నగూడెం, ఎ.సీతారాంపురం, చిరివాడ తదితర గ్రామాల నుండి 224 కుటుంబాలకు వెంకట్రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర టిడిపి నాయకులు ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు, చిరుమామిళ్ల సూర్యం, గుండపనేని ఉమా వరప్రసాద్, మూల్పూరి సాయి కల్యాణి, వేములపల్లి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, అట్లూరి శ్రీనివాసరావు వేగిరెడ్డి పాపారావు, వడ్డిల్లి లక్ష్మి మాదాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌లో టిడిపిలో చేరుతున్న దృశ్యం

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి ఉయ్యూరు : ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి నాగన్నగూడెంలో అగ్నిప్రమాద బాధితులను మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిమ్మగడ్డ నరసింహారావు, నిమ్మగడ్డ నాగేశ్వర రావుకు చెంది ఇల్లు, గేదెల చావిడి, రెండు గేదెలు కాలిపోయి నిరాశ్రయులయ్యారు. అగ్నిబాధిత కుటుంబాలను రాజేంద్రప్రసాద్ కలసి ఆర్థిక సాయం అందజేసి ధైర్యం చెప్పారు. టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అజ్మతుల్లా, ఎస్సీ సెల్ నాయకుడు భాగ్యరాజు, టీడీపీ నాయకులు నరేంద్ర, శ్రీనివాసరావు తదితరులు బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ మోర్ల బసవయ్య గహం ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, టిడిపి నాయకుల తుమ్మల చౌదరి బాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్ బసవయ్యను పరామర్శించి ప్రమాదాన్ని గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

గురక వ్యాధి నివారణే ఐఎఎస్ఎస్ఎ లక్ష్యం

స్నోర్ కాన్ సదస్సులో పద్మశ్రీ కామేశ్వరన్

సీనియర్ వైద్యులను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: సమాజంలో మారుతున్న జీవనశైలి కారణంగా ప్రతి మనిషి అనేక వ్యాధుల బారిన పడిన సందర్భాలలో ఆ వ్యాధిని సకాలంలో గుర్తించడంలో వైద్యులు తాము అభ్యసించిన వైద్య పరిజ్ఞానంతో పాటు రోగి మానసిక స్థితిని కూడా పరిశీలించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మోహన్ కామేశ్వరన్ అన్నారు. గురక వ్యాధి నివారణ కోసం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఫర్ స్లీప్ ఆప్నియా (ఐఎఎస్ఎస్ఎ) ప్రతి ఏటా దేశంలో వివిధ ప్రాంతాలలో 'స్నోర్ కాన్' పేరుతో నిర్వహిస్తున్న సదస్సుకు ఈ ఏడాది విజయవాడ నగరం వేదికైంది. ఎఒఐ(అసోసియేషన్ ఆఫ్ ఓటోలారిన్జాలజిస్ట్స్, ఎపి), ఎఒఐ (విజయవాడ విభాగం) సంస్థల సంయుక్త ఆధ్వరంలో విజయవాడలోని సాగర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం సదస్సు జరిగింది. డాక్టర్ విద్యాసాగర్ అతిధులకు ఆహ్వానం పలకగా కామేశ్వరన్ మాట్లాడుతూ గురక వ్యాధి నివారణ కోసం ప్రపంచంలో జరిగిన, జరుగుతున్న వివిధ పరిశోధనల ఫలితాలను వివరించారు. గురక వ్యాధిగ్రస్తులకు అత్యాధునిక వైద్య విధానాల ద్వారా చికిత్స అందించడమే లక్ష్యంగా ఐఎఎస్ఎస్ఎ పని చేస్తోందన్నారు. సాధారణంగా శ్వాస కోశంలో వచ్చే సమస్యలే మనిషి గురక వ్యాధికి కారణం అవుతాయన్నారు. ఈ వ్యాధి ప్రారంభంలో సమస్యగా కనిపించకపోయినప్పటికీ తీవ్రమయ్యే కొద్దీ రోజువారి జీవితంలో పలు మానసిక సమస్యలు సంభవిస్తాయన్నారు. కొన్ని సందర్భాలలో ఊబకాయం వల్ల కూడా కొంతమంది వ్యక్తులు గురక వ్యాధి బారిన పడుతున్నారన్నారు. గురక వ్యాధి వల్ల ప్రధానంగా సుఖ నిద్ర ఉండదన్నారు. తమతో కలిసి జీవించే వారి సంతోషానికి కూడా ఇదొక పెద్ద అవరోధమన్నారు. యాంటీ డిప్రెషన్ కూడా గురక వ్యాధికి ఒక కారణమన్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారికి కొన్ని సందర్భాలలో నిద్రించే సమయంలో కొన్ని క్షణాల పాటు శ్వాస అందక ఉలిక్కిపాటుకు గురై వెంటనే మెలకువ వచ్చేస్తుందన్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి బారిన పడిన వారికి అవసరమైనంత రాత్రి నిద్ర ఉన్నప్పటికీ పగటిపూట కూడా చాలా నీరసం, అసహనం వంటివి కలుగుతాయ న్నారు. ఇటీవల కాలంలో ఔషధ రంగ పరిశోధనల కారణంగా ఈ వ్యాధి నివారణ కోసం శస్త్ర చికిత్సలతో పని లేకుండా ఔషధాల ద్వారా కూడా నయం చేయవచ్చన్నారు. ఔషధాలు లేకుండా కూడా ఈ సమస్యను అధిగమించేందుకు ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్న పరికరాల గురించి సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ దీన్ దయాళ్, స్నోర్ కాన్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పి.ఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ శ్రీనివాస్ కిషోర్, వికాస్ అగర్వాల్, పి.విజయ్ కృష్ణన్, శింగరి ప్రభాకర్ తదితరులతో సహా జాతీయస్థాయిలో ప్రసిద్ధి పొందిన పలువురు వైద్య రంగ ప్రముఖులు సదస్సులో పాల్గొని గురక వ్యాధి నివారణపై వివిధ అంశాలను చర్చించారు. సదస్సులో పలువురు సీనియర్ వైద్యులను సత్కరించారు.

పశ్చిమ నుంచి పోటీకి సిద్ధం : బుద్ధా

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా వున్నానని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంట్ గాని విజయవాడ వెస్ట్ గాని రెండిట్లో ఓ సీటు తనకు ఇస్తారని, తాను పోటీ చేస్తానని చెప్పారు. నన్ను పక్కనపెట్టే ఆలోచన చంద్రబాబుకు లేదని, రాబోయే 30 సంవత్సరాలు లోకేష్‌కి అండగా నిలబడతానని ఆయన అన్నారు. పొత్తులు ఓకే అయినా సీట్ల సర్దుబాటుపై ఇంకా క్లారిటీ రాలేదన్నారు. తమ పార్టీలో ఎవరైనా టిక్కెట్టు రాలేదని చంద్రబాబుని బ్లాక్‌మెయిల్ చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. మాజీ ప్రధాని పివి నరసింహారావుని జగన్ అవమానించారని, గతంలో వైయస్ఆర్ కడప సభలో పివిపై చెప్పులు వేయించి అవమానిస్తే ఇప్పుడు జగన్ అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటనతో జగన్ వెన్నులో వణుకు మొదలైందన్నారు. ఈ సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కలశ మహోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ పర్వదిన మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా

నిర్వహిస్తున్నామని శ్రీ వాసవి ఫౌండేషన్ చైర్మన్ వి.వి.కె. నరసింహారావు తెలిపారు. ఆదివారం పవిత్ర కష్ణానది దుర్గా ఘాట్ నుండి 102 మంది కన్యలతో కృష్ణా నది దుర్గా ఘాటు నుండి కలశాల మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా మేళతాళాలతో నగర పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం జరిగింది. అనంతరం అమ్మవారికి వివిధ రకాల పండ్ల రసాలతో పంచామత అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం యాత్రికులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రతినిధులు మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం శ్రీ వాసవి ఫౌండేషన్, అవోపా కష్ణా మహిళా విభాగ్, వాసవి పరివార్ రాష్ట్ర మహిళా విభాగ్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ విజయవాడ, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘంల సంయుక్త ఆధ్వర్యములో శ్రీ వాసవి అమ్మవారి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.



జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-భవానీపురం: పశ్చిమ నియోజకవర్గం 44వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 44వ డివిజన్ జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని ఆదివారం జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్ పోతిన వెంకట మహేష ప్రారంభించారు. ముందుగా సితార సెంటర్ నుంచి కార్యాలయం ఏర్పాటు చేసిన విద్యాధరపురంలోని చెరువు సెంటర్ వరకు ప్రదర్శనగా తరలివచ్చారు. డివిజన్ అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల జనసేన అధ్యక్షులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు

జనసేన నాయకులు గూడేల దుర్గారావు ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో పశ్చిమ ఇన్చార్జ్ పోతిన వెంకట మహేష్ సమక్షంలో శ్రీనుతో పాటు 50 మందికి పైగా జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల అధ్యక్షులు అమీర్ బాష, కొరగంజి వెంకటరమణ, సోమి గోవింద్, పులిచేరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగా కాంస్య విగ్రహానికి శంకుస్థాపన



ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎస్వీ రంగారావు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని వి.ఎం.రంగా జంక్షన్ వద్ద రంగా కాంస్య విగ్రహానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రంగా ఎల్లవేళలా అండదండగా నిలిచారని కొనియాడారు. రంగా ఏ ఒక్క వర్గానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరివాడని నివాళు లర్పించారు. ఈ ప్రాంతంలో వంగవీటి రంగా కాంస్య విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, నవ్యాంధ్ర కాపు సంఘం నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్, కార్పొరేటర్లు మహదేవు అప్పాజీరావు, యలకల చలపతిరావు, అత్తులూరి ఆదిలక్ష్మి, అత్తులూరి పెద్దబాబు, ఎస్వీ రంగారావు కాపు సంఘం అధ్యక్షులు పదిలం రాజశేఖర్, పత్తి నాగేశ్వరరావు, వడ్లని మాధవరావు, లింగం శివప్రసాద్, గంధం అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

గరుడోత్సవం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వేదాద్రి గ్రామంలోని శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయంలో యోగానంద స్వామి వారి గరుడోత్సవం, అమ్మవారి పల్లకీ సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికులు భక్తులు స్వామివారిని దర్శించుకుని గరుడ సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వేదాంతం యోగానందాచార్యులు, మురళీధరాచార్యులు, వేణుమాధవచార్యులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలతో అద్భుత పాలన

ఎంపి నాని, ఎంఎల్ఎ ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి సిఎం జగన్ ప్రజలకు అద్భుత పాలన అందిస్తున్నారని ఎంపి కేశినేని నాని, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్రంలో అడుగులు పడుతున్నాయని, గ్రామీణాంధ్రప్రదేశ్‌లో నవ వసంతం వెల్లివిరియనుందని పేర్కొన్నారు. మండలంలోని గండ్రాయి గ్రామంలో కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన రెండు గ్రామ సచివాలయాలను ఆదివారం వారు ప్రారంభించి మాట్లాడారు. జగన్ గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే పాలనను చేర్చారని తెలిపారు. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో 40 లక్షల రూపాయలతో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపి నాని

జగనన్న కాలనీలో గృహ ప్రవేశం

పేదలకు వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలిచ్చి గృహాలను కూడా నిర్మిస్తుండటంతో అద్దె ఇళ్ల కష్టాలకు శాశ్వతంగా తెరపడుతోందని ఎంపి కేశినేని నాని, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని గండ్రాయి గ్రామంలో ఆదివారం జగనన్న కాలనీలో కట్టా శ్రీను, కోరివి సైదులు, యడ్ల గోపి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను అందచేసి గృహ నిర్మాణాలను చేపట్టడం అభినందనీయమన్నారు.

పెద్దమ్మతల్లి గుడికి శంకుస్థాపన

గండ్రాయి గ్రామంలో ముదిరాజుల కోరిక మేరకు చెరువు కట్ట సమీపంలో టీటీడీ ద్వారా 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న పెద్దమ్మతల్లి గుడికి ఉదయభాను, నాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

క్రీడాకారులకు అభినందన

రాష్ట్రంలో గ్రామీణ క్రీడాకారులను గుర్తించి, ప్రోత్సహించడానికి ఇదివరకెన్నడూ లేని విధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం నూతన ఒరవడికి నాంది పలికిందని ఉదయభాను అన్నారు. గండ్రాయి గ్రామ సచివాలయం-1 పరిధిలో ఇటీవల జరిగిన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గస్థాయి పోటీలలో గండ్రాయి గ్రామానికి చెందిన యువకులు ఖోఖోలో మొదటి బహుమతి సాధించిన సందర్భంగా ఎంపీ కేశినేని శ్రీనివాస్, ఉదయభాను ఖోఖో జట్టు సభ్యులను అభినందించారు. అనంతరం వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

ఆ పేషిలో సిసిలదే హవా...!

- సమస్యలు చెప్పుకునేందుకూ అవకాశం ఇవ్వడం లేదని ప్రజల ఆరోపణ
- ఏళ్ల తరబడి అక్కడే తిష్ట

జిల్లాలో అ అధికారిని కలవాలంటే ముందు అ అధికారికి సిసిలుగా వ్యవహరిస్తున్న వారిని ప్రసన్నం చేసుకోవాలని, లేకుంటే అధికారిని కలవటం పెద్ద ప్రహసనమే అవుతుందని ఆ సిసిలపై పెద్ద ఎత్తున విమర్శలు వినబడుతున్నాయి. తీరా ఏదో విధంగా అ అధికారి దగ్గరకు వెళ్ళి తమ సమస్యను చెప్పుకుందాం అని ఛాంబర్ లోకి వెళ్ళేటప్పుడు వారి వెనకే వచ్చి నిలబడ తారని .. వెళ్లిన వారు పూర్తిగా సమస్యను పూర్తి స్థాయిలో చెప్పకుండానే దగ్గరుండి బయటకు తీసుకు వచ్చస్తరనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినబడుతున్నాయి. ఇలా అయితే సమస్యలు ఏ విధంగా పరిష్కారం అవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలు కిందిస్థాయి అధికారుల దగ్గర పరిష్కారం దొరక్కపోతే జిల్లా కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్ ను కలిసి తమ సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుండి ప్రతిరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంకి తరలి వస్తుంటారు .అయితే జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కలవడానికి ప్రజలు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఎందుకంటే తమ సమస్యను వారిని కలిసి చెప్పుకుంటే తప్పని సరిగా పరిష్కారం అవుతుం దని నమ్మకం.. అయితే జిల్లా కలక్టర్ కు ఉన్న పని ఒత్తిడి వల్ల జాయింట్ కలక్టర్ ను అయిన కలిసి తమ సమ స్యలు విన్నవించుకునేందుకు ఎక్కువ ప్రయత్నిస్తారు. ఇక్కడే మొదలవుతుంది అసలు కథ. సామాన్య ప్రజలను ఆ అధికారిని కలవడానికి ఇక్కడ సీసీలుగా వ్యవహరిస్తున్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోరు.. మేడం సమావేశంలో ఉన్నారు.ఇప్పుడు కలవడం కుదరదు అని తెగేసి చెప్పేస్తారు. అయితే అదే సమయంలో వారికి అవసరమైన వారిని కావలసిన వారిని మాత్రమే లోపలికి పంపుతారనే విమర్శలు లేక పోలేదు.అయితే దూర ప్రాంతాల నుండి ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి వచ్చిన ప్రజలు సిసి లు చెప్పిన సమాధానానికి నీరు గారిపోతారు. ఎంతో దూరం నుండి వచ్చాం అండి ఎలాగైనా వారిని కలవలండి అని వారిని బ్రతిమలాడు కుంటారు. అయితే బయట వేచి ఉండండి అవకాశం ఉంటే పంపిస్తాము అని బదులిస్తారు. ఇక కొన్ని గంటల నిరీక్షణ తర్వాత వీరిని లోపలికి పంపిస్తారు. వారి వెంటే అ సిసి లలో ఒకరు వచ్చి నిలబడి సమస్యను పూర్తి గా చెప్పకుండానే వెంటనే వారిని బయటకు వచ్చేయాలని ఆదేశిస్తారు. దీంతో సమస్యలు చెప్పుకుందామని లోపలికి వెళ్ళిన ప్రజ లకు నిరాశే ఎదురవుతుందని పలువురు పేర్కొం టున్నారు.

తమ సమస్యలను సవివిరంగా అధికా రులకు చెప్పుకుందాం అని ఉన్నాతాధి కారుల వద్దకు వచ్చే ప్రజలకు సిసి రూపంలో అడ్డుకుంటున్న వారి హవాను నిరోధించి అధికారులకు ,ప్రజలకు మధ్య వీరు ఏర్పరుస్తున్న దూరాన్ని తగ్గించాలని తద్వారా ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పారదర్శక పాలన అందే విధంగా చూడాలని జిల్లా ప్రజలు ముక్త కంఠం తో కోరుతున్నారు. అలాగే వీరిపై అనేక ఆరోపణలు లేకపోలేదు. వారికి కావాల్సిన వారి పైల్సుకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారని వాటినే అధికారి వద్దకు పంపుతారానే ఆరోపణలు పెద్ద ఎత్తున వినబడు తున్నాయి. ఇటీవల కాలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆ ఉన్నతాధికారి పైల్స్ పెట్టే విషయంలో వీరిని తీవ్రంగా హెచ్చరించినట్లు ఉద్యోగులు చర్చించు కుంటున్నారు. ఏ పైల్ పెట్టాలి.. ఏ పైల్ ఆపాలి అనేది నేను చూసుకుంటాను. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండండి అంటూ హెచ్చరించినట్లు తెలుస్తోంది. దీనంతటికీ కారణం ఏళ్ల తరబడి సిసిలుగా తిష్ట వేయడమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

అప్పారావుపేటలో 'స్వచ్ఛభారత్'

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మూడవరోజు క్యాంపులో భాగంగా ఆదివారం నారయ్య అప్పారావుపేట గ్రామంలో స్వచ్ఛ భారత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు రోడ్లను శుభ్రం చేసి మొక్కలు నాటారు. అంతే కాకుండా ప్రతి ఇంటికి వెళ్ళి మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి అని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మెక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కు అందరూ శ్రద్ధగా కషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్ నాగరాజు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి శ్రీహరి బాబు, మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు జె దుర్గా, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి నాందిగా డిజిటల్ లైబ్రరీలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కోడూరు : గ్రామాలలో వైయస్సార్ డిజిటల్ లైబ్రరీలు ప్రగతి పదానికి నాంది అని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆదివారం కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో వైయస్సార్ విలేజ్ డిజిటల్ లైబ్రరీని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి శిలా పథకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉన్నతంగా ఎదగాలంటే వాటికి తగ్గ పుస్తకాలు చదవడం, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం చాలా అవసరం అని గుర్తించి ప్రతి గ్రామంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నారనీ అన్నారు. ఈకార్యక్రమంలో దివి మార్కెట్ యార్డ్ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఉల్లిపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ వెర్రి పావని, జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కార్యాదర్శి యలవర్తి సుబ్రహ్మణ్యం అధికారులు కోడూరు మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది : కైలే

ప్రజాశక్తి-పమిడిముక్కల : దాతల సహకారం మరువలేనిదని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం పమిడిముక్కల మండలంలోని మంటాడలో పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 13 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణ, 5 లక్షల రూపాయలతో నిర్మించిన కార్యాలయం ఎంఎల్ఎ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిని మానవత్వాన్ని పెంచడానికి ఆలయాల్లో చేసే నిత్య అన్నదాన కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. సమాజం కోసం మంచి పనులు చేయడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సాయి అన్న హెూమ్ ఫుడ్స్ సభ్యులు, ఆలయ కమిటీ రామ్మోహన్రావు, కోడెపోయిన కోటేశ్వరరావు, పమిడిముక్కల జడ్పిటిసి సభ్యురాలు వేణు వెంకటరమణ కుమారి, ఆలయ కమిటీ కార్యదర్శి మాధవి లత, గౌడ కార్పొరేషన్ సభ్యులు సొంటి వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, మంటాడ గ్రామ సర్పంచ్ నందమూరి వీరమ్మ, మంటాడ ఎంపీటీసీ సభ్యురాలు మెరుగ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉయ్యూరు- కాటూరు రోడ్డు

ప్రజాశక్తి ఉయ్యూరు : ఉయ్యూరు–కాటూరు–తేలప్రోలు ఆర్అండ్ బి రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో వాహనాలు నడిపేవారు భయాందోళనకు గురవుతున్నారు. ఉయ్యూరు నుంచి కాటూరు, తేలప్రోలు వెళ్లే ఆర్అండ్ బి రోడ్డు శ్రీవిశ్వశాంతి స్కూల్ సమీపాన కోసుకుపోతూ ప్రమాద స్థితికి చేరుకుంది. స్కూల్కు వెళ్లే విద్యార్థులతో పాటు మండల పరిధి గ్రామాలతో పాటు ఉంగుటూరు, పెదపారుపూడి మండలాల గ్రామాలకు వెళ్లే వాహనాలు, బస్సులతో అనునిత్యం రద్దీగా ఉండే ఈరోడ్డులో స్కూల్ సమీపాన కొంతమేర ఓప క్క కోతకు గురైంది. ఈప్రాంతంలో రోడ్డుపక్కన గ్రామపంచాయతీ చెత్తకుండీలు ఏ ర్పాటు చేయగా రోడ్డుపొడవునా పరిసర ప్రాంతాల్లో నివసించేవారు ఇళ్లలోని వ్యర్థాలు, చెత్త పోయడంతో ఎలుకలు చేరి రోడ్డును తొలచివేస్తున్నాయి. దీంతో కొంతమేర రోడ్డు డొల్లగా తయారై ప్రమాదకరంగా ఉంది. ఆర్అండ్ బి అధికారులు ఇప్పటికైన స్పందించి రోడ్డు మరింత మేర కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, గండిగుంట గ్రామపంచాయతీ అధికారులు కూడా చెత్తకుండీలు అక్కడనుంచి తొలగించి మరో చోట ఏర్పా టుచే యాలని ప్రజలు కోరుతున్నారు.

కోతకు గురై రోడ్డు

అంగన్‌వాడీల పోరాటం మరువలేనిది

మాట్లాడుతున్న చౌటపల్లి రవి

హాజరైన అంగన్‌వాడీలు

పామర్రు: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్(సిఐటియు అనుబంధం) యూనియన్ అభినందన సభ పామర్రు ఆరేపల్లి కళ్యాణ మండపం ఆవరణలో జరిగింది. ఈ సభకు పామర్రు ప్రాజెక్టు లీడర్ కే ఉమారాణి అధ్యక్షత వహించారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటుప్పల్లి రవి మాట్లాడుతూ అంగన్వాడీల పోరాట పటిమను కొనియాడారు. కుటుంబ పరంగా, స్థానికంగా, బయట నుండి అనేక ఒత్తుడులు వచ్చినప్పటికీ అంగన్‌వాడీలు సాగించిన పోరాటానికి మరువలేనిదన్నారు. డిమాండ్స్ ను పూర్తిగా నెరవేర్చుకునే వరకు మరో పోరాటానికైనా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఓ గంగాధర్ ప్రసాద్, యుటిఎఫ్ నుండి అంక రవి, నరేంద్ర, కెవిపిఎస్ సంఘం నుండి ముళ్ళపూడి విల్సన్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కుమారి, స్వరూప రాణి, ప్రజా సంఘాల నాయకులు కే నాగభూషణం, బిల్డింగ్ యూనియన్ నాయకులు ఐ రాజు, పలు మండలాల అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ పిఎసిఎస్‌ను మరింత బలోపేతం చేయాలి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పిఎసిఎస్ ను మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కోరారు. ఆదివారం అవనిగడ్డ పీఏసీఎస్ వద్ద నూతన చైన్ పర్సన్ గా నియమితులైన వైసీపీ మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రమేష్ బాబు మాట్లాడుతూ సొసైటీని అభివద్ధి పరచాల్సిన బాధ్యత నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు పై ఉందన్నారు. పేదల మనసు గెలిచిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ తప్పక గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓడిపోతారు అనే భయంతోనే మిగిలిన పార్టీలు పొత్తు లతో పోటీ చేస్తున్నాయని విమర్శించారు. మళ్ళీ జగన్ గెలిస్తే ఎప్పటికంటే ఎక్కువ పేద ప్రజలకు మంచి చేస్తారని

రేపల్లె శ్రీనివాసరావును శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే వైసీపీ నాయకులు

రమేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతు విభాగం ఛానల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి పార్టీ అభివద్ధి కషి చేస్తున్న రేపల్లె శ్రీనివాసరావు కు ఎమ్మెల్యే రమేష్ బాబు సహకార సంఘం చైర్మన్ గా నియమించడం సంతోషదాయకం అన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు వచ్చే విధంగా ఎమ్మెల్యే రమేష్ బాబు నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకం అన్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్గా నియమితులైన శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘం ద్వారా రైతులకు అందించే రుణాలు సకాలంలో అందించడానికి కషి చేస్తానని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీవీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ దొంగల సుమతీదేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్న, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు గరికపాటి వెంకటేశ్వరరావు, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, కొత్తపేట పిఎసిఎస్ చైర్మన్ బడే వెంకటేశ్వరరావు, లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు, వైసిపి యువజన విభాగం రాష్ట్ర సమీక్ష కార్యదర్శి అవనిగడ్డ మండల పార్టీ యూత్ కన్వీనర్ చింతలపూడి బాలు, ఎంపిటిసి సభ్యులు వర్రె నరేష్ బాబు, పాల్గొన్నారు

కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

సమాజాన్ని ప్రభావితం చేసేది సజనాత్మక కవిత్వమే

తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీపార్వతి

ప్రజాశక్తి - విజయవాడ : సృజనాత్మకత మేళవింపుతో కూడిన కవితలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని, తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందమూరి లక్ష్మి పార్వతి అన్నారు. "పుణ్యభూమి నా దేశం నమోనమామి" పేరుతో ఎల్ఐసి, నవభారత నిర్మాణ సంఘం, మల్లేతీగ సాహిత్య సేవా సంస్థ, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్, స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఠాగూర్ లైబ్రరీలో శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ఈసమ్మేళనంలో లక్ష్మి పార్వతి ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ... సజనాత్మకతతో కూడిన కవితల ఆవశ్యకత గురించి వివరించారు. అవి సమాజానికి మేలు చేసేలా, సమాజాన్ని ప్రభావితం చేసేలా ఉండాలన్నారు. మంచి కవి, రచయిత, కళాకారుడు ప్రజలను ఆలోచింప చేస్తారన్నారు. శ్రీశ్రీ, కష్ణ శాస్త్రి, గుంటూరు శేషేంద్ర శర్మ సాహిత్యం తనకు ఎంతో ఇష్టమన్నారు. వారివి వేర్వేరు మార్గాలైనా తనకు స్ఫూర్తిని ఇచ్చాయన్నారు. గాంధీ దేశం వెల్ఫేర్ ట్రస్ట్ గాంధీ నాగరాజు మాట్లాడుతూ ఓట్లు కొనుగోలు చేసే విధానాన్ని తూర్పారబట్టారు. కప్పగంతు రామకష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.సుధాకర్ బాబు, ఒఎస్‌డి టు గవర్నమెంట్, రాష్ట్ర శాసనసభ చీఫ్‌విప్ డాక్టర్ ఎం ప్రభాకర్, కె.కలిమిశ్రీ తదితరులు ప్రసంగించారు. అనంతరం లక్ష్మీ పార్వతిని, విజేతలైన కవులను ఘనంగా సత్కరించారు.

కాచి చల్లార్చి వడపోసిన నీటినే తాగండి

విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - విజయవాడ : నగర ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు కాచి చల్లార్చి వడపోసిన నీటినే తాగాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఆయన ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవేళ తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపం కలిగినా, వాసన వచ్చినా, కొంచమైన మురికి కనిపించినా వెంటనే తమ తమ ప్రాంతాల్లోని సచివాలయాల్లో ప్రజలు సమాచారం ఇవ్వాలని సచివాలయం సిబ్బంది వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

ముగిసిన గుణదల మేరీమాత ఉత్సవాలు

హాజరైన జనం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గుణదల మాత నిష్కళంక మాతగా నీరాజనాలు అందుకుంటోందని ఇండియా నేపాల్ పోప్ వాటికన్ రాయబారి లియోపోర్డో జెరెల్లి అన్నారు. గత మూడు రోజులుగా జరుగుతున్న గుణదల మేరీమాత ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో యాత్రికులు వచ్చారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెరెల్లి మాట్లాడుతూ విజయవాడ గుణదల మాతకు ఎంతో చరిత్ర ఉందన్నారు. ప్రస్తుతం వంద సంవత్సరాల వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కుల మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గుణదల మాతను ఆరాధిస్తారని తెలిపారు. విశాఖపట్నం అర్చి బిషప్ మల్లవరపు ప్రకాష్, విజయవాడ బిషప్ తెలగతోటి రాజారావు, వరంగల్ బిషప్ ఉదుముల బాల, ఏలూరు బిషప్ జయ రావు,గుంటూరు బిషప్ భాగయ్య, తదితర గురువులు నూరు వసంతాల సందర్భంగా సమిష్టి దివ్య పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ గ్రాసీ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన సాంస్కతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.

మేరీమాతను దర్శించుకున్న ఐఅండ్‌పిఆర్ కమిషనర్

గుణదల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఐఅండ్‌పిఆర్ కమిషనర్ టి.విజయ్ కుమార్ రెడ్డి ఆదివారం రాత్రి గుణదల లూర్దు మాతను దర్శించుకున్నారు. సోషల్ సర్వీస్ సెంటర్ డైరక్టర్ ఫాథర్ తోట సునీల్ రాజు ఆయనకు ప్రత్యేక పార్ధనలు చేసి హోలి వాటర్ చల్లి దీవెనలను అందచేశారు. అనంతరం కమిషనర్ ప్రధాన దేవాలయంలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్ధన చేసుకున్నారు. ఈకార్యక్రమంలో పలువురు ఐఅండ్‌పిఆర్ అధికారులు, విజయవాడ ప్రెస్‌క్లబ్ మాజీ కార్యదర్శి బొంత విలియం పాల్ పాల్గొన్నారు.

గుణదల కొండపై పూజలు

ప్రార్థనల్లో పాల్గొన్న ఐఅండ్‌పిఆర్ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి

గురువులను తోడ్కొని వస్తున్న దృశ్యం

ప్రార్థనలు చేస్తున్న గురువులు

అశ్లీల సాహిత్యంపై పోరాడాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వ్యాపార, వాణిజ్య దష్టిలో సమాచార ప్రసార మాధ్యమాల్లో వచ్చే, వెలువడే అశ్లీల సాహిత్యంపై నిరంతర పోరాడాలని పలువురు ఉద్ఘాటించారు. అశ్లీలత ప్రతిఘటన వేదిక అధ్యక్షులు, ప్రముఖ గాంధేయవాది ఈదర గోపీచంద్ సాహిత్య సంకలనం "కామోత్సవ దహనం" ఆవిష్కరణ సభ స్థానిక బెంజిసర్కిల్ వద్ద ఉన్న సర్వోత్తమ గ్రంధాలయంలో ఆదివారం జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెచ్చ దుర్గా భవానీ, ఏపి గ్రంధాలయ సంఘం కార్యదర్శి రావి శారద ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభలో దుర్గాభవాని మాట్లాడుతూ రాష్ట్రంలో అందాల పోటీలు, అశ్లీల సాహిత్యం, సినిమాల మీద ప్రజా సంఘాలు పోరాటంలో అక్రమ అరెస్టులు, కోర్టు కేసులు ఎదుర్కొంటున్నామని, ఏనాటికైనా న్యాయమే గెలుస్తుందని, అందుకు గోపిచంద్ పోరాటమే నిదర్శనమన్నారు. యువతలో నేర ప్రవత్తి పెరగడానికి ప్రధాన కారణం మద్యం, హింస, అశ్లీలతే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత గోపీచంద్, ప్రజాసాహితి అధ్యక్షులు దివికుమార్ ఎపి ప్రజా నాట్యమండలి అధ్యక్షులు పి.చంద్రా నాయక్, చల్లపల్లి విజయ, అరసం కార్యదర్శి మోతుకూరి అరుణ కుమార్, ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నగర సమగ్రాభివృద్ధే అజెండాగా ఉండాలి

స్థానిక సంస్థలకు కేటాయించేలా చట్టం చేయటానికి కషి చేయాలని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో వారు విజయవాడ సమగ్రాభివృద్ధికి అవసరమైన అంశాలను వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు 5 టిఎంసిల నీరు అవసరమై ఉన్నందున ఈ నీటి నిల్వకు కష్ణా నది బ్యారేజి దిగువ భాగంలో చెక్ డాం నిర్మించాలి. సింగ్‌నగర్, వాంబే కాలనీ, గుణదల వద్ద రైల్వే ట్రాక్‌లపై నాలుగు లైన్ల ఫ్లైఓవర్లు నిర్మించాలి. నదికి దక్షిణం వైపు ఉన్న సీతానగరం నుండి ఉత్తరం వైపు ఉన్న ఫ్లైఓవర్ వరకు కష్ణానదిపై నాలుగు లైన్ల బ్రిడ్జిని నిర్మించాలి. బస్‌స్టాండ్ నుండి బందరురోడ్డు, ఏలూరు రోడ్డు, సింగ్‌నగర్ రోడ్లలో ట్రాం బళ్లను ఏర్పాటు చేయాలి. నగరంలో విద్యుత్ బస్సులు ప్రవేశ పెట్టాలి. మున్సిపల్ చట్టాల్లో పార్కింగ్ సౌకర్యాలను విధిగా ఏర్పాటుచేసే నిబంధనను, బస్‌స్టాప్ల నిర్మాణం, నిర్వహణ నిబంధనలను చేరుస్తూ చట్ట సవరణలకు కషిచేయాలి. రిజిస్ట్రేషన్ సమయంలోనే పట్టణ స్థానిక సంస్థల్లోనూ ఆస్తి కోనుగోలుదారుని పేరుమీదకు మారేవిధంగా ఏర్పాటుచేయాలి. పారిశ్రామికాభివద్ధి ద్వారా నగర విస్తరణ జరగాలి. ఆగిరిపల్లి, గన్నవరం, కంకిపాడు, నందిగామ, మైలవరం ప్రాంతాల నుండి గ్రామాలను కలుపుతూ విజయవాడకు మెట్రో రైల్ లేదా మోనో రైల్ ఏర్పాటు చేయాలి. నగరంలో శిల్పారామం ఏర్పాటు చేయాలి. గాంధీ కొండపై ఉన్న ప్లానెటోరియంను ప్రజలకు అందుబాటులోకి తేవాలి. విజయవాడ ప్రభుత్వాస్పత్రుల్లో తగినన్ని బెడ్లు ఏర్పాటు చేసి అన్ని విభాగాల్లో సరిపడా వైద్యులను, సిబ్బందిని నియమించాలి. డిస్నీలాండ్ స్థలాన్ని పబ్లిక్ కార్యక్రమాలకు అందుబాటులో ఉండేవిధంగా కషిచేయాలి. నగరంలో పబ్లిక్ స్థలాలను ప్రైవేటీకరించరాదు. పార్కింగ్ లాట్లు, పార్కుహౌస్‌లు నగరమంతా నిర్మించాలి. అన్ని రోడ్లకు ఫుట్‌పాత్లు, జీబ్రా మార్కులు, మనుషులు రోడ్డు దాటడానికి సిగ్నల్ లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ సింబల్స్ ఏర్పాటు చేయాలి. స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి. స్టార్మ్ వాటర్ డ్రైన్లు నిర్మించి వాటిని పూర్తిగా కాంక్రిట్ బిళ్లలతో మూసివేసి వర్షం నీరు పోయేందుకు అక్కడక్కడా ఉక్కు జాలీలు పెట్టాలి. అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ ఆర్‌టిసి సిటీ బస్సులను ఏర్పాటు చేసి సిటీలో ఛార్జీలు రూ.20లకు మించకుండా చూడాలి. రోడ్ల నిర్మాణం పదేళ్లయినా నిలిచి ఉండేలా జరిగాయి. నగరంలో విద్యుత్ వైర్లను అండర్ గ్రౌండ్‌లో వేయాలి. ఈ మీడియా సమావేశంలో పి.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో నవరత్నాలు అమలు

పొదుపు ఖాతాలకు జమ చేశాం.

ప్రశ్న : సున్నా వడ్డీ పథకం ఎలా అమలవుతోంది ?

ఈ పథకం 2019 నుంచి 2020 వరకు మొదటి విడతలో 32,549 గ్రూపుల్లోని 3,14,733 మంది సభ్యులకు రూ.32.98 కోట్లు జమ చేశాం. అలాగే రెండో విడతలో 3,31,751 మందికి రూ.35.71 కోట్లు, మూడో విడతలో 35,799 గ్రూపుల్లోని 3,68,116 మందికి రూ.38.49 కోట్లను పొదుపు ఖాతాలకు జమ చేశాం.

ప్రశ్న : వైఎస్ఆర్ చేయూత పరిస్థితి ఏమిటి?

45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాల పేద మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున గత నాలుగేళ్లలో ఒక్కక్కరికి మొత్తం రూ.75 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాం. అంతేగాక పెట్టుబడి నిమిత్తం అదనంగా రుణాలు అందించాం. ఈపథకం కింద రూ.505.67 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించాం.

ప్రశ్న : జగనన్న తోడు పథకం అమలు ఎలా ఉంది?

చిరు వ్యాపారులు తమ రోజు వారీ పెట్టుబడికి అవసరమైన రూ.2 వేల నుండి రూ.5 వేల వరకు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పు తీసుకొని ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈక్రమంలో వారికి రూ.10 వేలను వడ్డీ లేని రుణాలుగా ఇవ్వడానికి జగనన్న తోడు పథకం అమలు జరుగుతోంది. ఇప్పటి వరకు ఎనిమిది విడతల్లో ఈ పథకాన్ని అమలు చేసి లబ్ధిదారులకు సాయం అందించాం.

ప్రశ్న : జగనన్న ఇళ్ల నిర్మాణం అమలు ఎలా ఉంది?

జిల్లాలోని 11 మండలాల పరిధిలో గల 21,584 మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేశాం. 24,980 మంది లబ్ధిదారులకు వివిధ బ్యాంక్‌ల ద్వారా రుణ సౌకర్యం కల్పించాం. పలు గ్రామాల్లో జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణం జరుగుతోంది.

కిడ్నీ వ్యాధికి మరొకరు బలి

సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గిరిజనులు కిడ్నీ వ్యాధితో పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. కొద్దిరోజుల క్రితం రేపూడి తండాలో వడిత్య కష్ణ, పెద్ద తండాలో ఓ మహిళ మరణించారని తెలిపారు. కిడ్నీ వ్యాధి నివారణకు ప్రభుత్వాలు శాశ్వత పరిష్కార మార్గం చూపకుండా తూతూమంత్రంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు పెట్టి ఊరుకుంటున్నాయన్నారు. ఎ. కొండురులో కిడ్నీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలన్నారు. తాత్కాలికంగా సరఫరా చేస్తున్న కృష్ణాజిలాలు నిలిచిపోవడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. కిడ్నీ బాధితులు చికిత్స కోసం లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి చేతిలో చిల్లి గవ్వలేక అల్లాడుతున్నారని, బాధితులు మరణించినప్పుడు కనీసం మట్టి ఖర్చులకు కూడా ప్రభుత్వం ఇవ్వడంలేదని విమర్శించారు. పైపులైను పనులను పూర్తి చేసి కృష్ణా జలాలను సరఫరా చేయాలని, ప్రస్తుతం నిలిచిపోయిన మంచినీటి ట్యాంకర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కిడ్నీ బాధితులకు పోషకాహారం అందించి వారి ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అక్రమంగా బుసక తవ్వకాలు

- ఖాళీ ప్రదేశాల్లో వందల ట్రక్కుల బుసక నిల్వ

ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్న దృశ్యం

రామలక్ష్మి కాలనీలో నిల్వ చేసిన బుసక

ప్రజాశక్తి-పెడన : దీపముండగానే ఇల్లు చక్కబెట్టు కోవాలని చందంగా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు, కార్యకర్తలు వ్యవహరిస్తున్నారు. దీనివలన ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతున్న సంబంధిత అధికారులు మాత్రం ఆటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలు తావిస్తోంది. దీంతో లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే పట్టణ పరిధిలోని అధికార పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు, తోటమాలకు చెందిన ఒకపోటా నాయకుడు అక్రమంగా బుసక మట్టిని తరలిస్తున్నారు. నిత్యం దాదాపుగా పది నుంచి పదిహేను ట్రాక్టర్లు తో నాలుగు జెసిబి లతో పట్టణ పరిసరాల్లోని వ్యవసాయ భూములలోని బుసక మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా చూస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. తమ పార్టీ అధికారంలో ఉందన్న ధీమాతో రాత్రింబవళ్ళు మట్టిని ఖాళీ ప్లాట్లను పూడ్చేందుకు, గృహనిర్మాణ సముదాయాలకు వీటిని విక్రయిస్తున్నారు. అంతేకాకుండా వర్షాకాలంలో అమ్ముకోవడానికి వీలుగా ఉండేందుకు ఖాళీ ప్రదేశాల్లో వందలాది ట్రక్కుల మట్టిని నిల్వ ఉంచుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టరు మట్టి రూ.1700 నుంచి రూ.2000 పైబడి అమ్మకాలు సాగిస్తున్నారు. దాదాపు రోజుకు సగటుగా 150 నుంచి 180 వరకు ట్రాక్టర్ ట్రక్కులు మట్టిని విక్రయం జస్తున్నారు. అంటే రోజుకు సగటుగా మూడున్నర లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఈ బుసకా మట్టి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పైడమ్మ కాలనీ పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లోనూ, అలాగే స్థానిక రామలక్ష్మి కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో వందలాది ట్రక్కుల మట్టిని నిల్వ ఉంచారు. అయితే వీరి వద్ద నుంచి ఆయా సంబంధిత శాఖ కార్యాలయాలకు నెలవారి మామూలు వెళుతున్నాయని పట్టణంలో ప్రచారం సాగుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ మట్టి ట్రాక్టర్లు, జెసిబిలపై కొరడాలు ఝులిపిస్తారో లేక రాజకీయ నాయకుల వత్తిళ్లకు నిమ్మకుండి పోతారో అన్నది చూడాల్సిందే.

ఓటమి భయంతో దాడులు : టిడిపి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో ఓటమి భయంతో వైసిపి అరాచకాలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొంతు చిన్న ఆరోపించారు. గన్నవరం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో దొంతు చిన్న మాట్లాడుతూ. పదిరోజుల క్రితం టిడిపి నాయకులు రంగబాబుపై దాడి, వైసిపి గుడాలు మద్యం మత్తులో ర్యాలీగా వచ్చి టిడిపి కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై వికృతి చేష్టలు చేయటం సరికాదు అన్నారు. అలాగే టిడిపి బ్యానర్లు చించి బీభత్సం సష్టించారని అన్నారు. పోలీసులు ఎదుట బ్యానర్లు చించితే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని అన్నారు. గన్నవరంలో టిడిపి జెండా ఎగురుతుంది అని గెలుపును ఎవరు ఆపలేరని అన్నారు మంచి చేసి ఓట్లు రాబాటుకోలి తప్ప అరాచకాలు చేసి గెలవాలి అనుకోవటం భ్రమ అన్నారు. భయపెట్టి తే భయపడే వారు లేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, గన్నవరం మండల మహిళ అధ్యక్షులు మేడే పల్లి రమా, గుజ్జర్లపూడి బాబూరావు, యంపిటిసి సభ్యులు పడమట రంగారావు, కొమ్మరాజు సుధీర్, తంగిరాల శ్రీనివాసరావు,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని పెనమకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 1987–88వ సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుని ఒకరిని ఒక్కరు, పరిచయం చేసుకుని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుని ఉత్సాహంగా గడిపారు. ఆటపాటలతో సందడి సందడి సాగిన ఈ కార్యక్రమంలో పూర్వ గురువులు పాల్, వెంకటరామయ్య ఉపాధ్యాయురాలు తులసిలను శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు బి నాగేశ్వరరెడ్డి .జె చంద్రశేఖర్ రెడ్డి . మటా.అమతబాబు,డి ఆనంద్ కుమార్, నాగేంద్ర, జహీర్, వాణిశ్రీ, హర్షవర్ధని తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.1500 కోట్ల నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - గుడివాడ : రాష్ట్ర బడ్జెట్లో రూ.1500 కోట్లు నిధులు కేటాయించాలని, ఆ నిధులను వడ్డెర్ల సంక్షేమానికి, అభివృద్ధికి ఖర్చు చేయాలని వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం గుడివాడ ఎన్జీవో భవన్ నందు ఏపూడుల ఏడుకొండలు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం కష్ణాజిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంజి దయాకర్ మాట్లాడుతూ వడ్డెరలకు ప్రత్యేక సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి వత్తిదారుని కుటుంబ సంక్షేమం కోసం రూ.50,000 ఆర్థిక సహకారం (నగదు బదిలీ) అందించాలన్నారు. సదస్సు అనంతరం ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం కష్ణాజిల్లా కన్వెనింగ్ కమిటీ ఐదు మంది నూతన కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా కన్వీనర్గా చంద్రగిరి శివ నాగ మల్లేశ్వరరావు, కోకన్వీనర్లుగా బోసు దుర్గారావు, గుంజ వీరభద్రం, తమ్మిశెట్టి నాగమ్మ, బత్తుల నాగరాజును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో గుడివాడ పట్టణ గౌరవాధ్యక్షులు తమ్మిశెట్టి లక్ష్మణరావు, గుడివాడ పట్టణ అధ్యక్షులు ఒర్సు రాములు, కోశాధికారి చల్లా చిన్నారావు, 50 మంది వడ్డెరలు, వడ్డెర వత్తిదారుల పాల్గొన్నారు.

నేడు వేలం పాటలు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటల నుండి ఇ-ప్రోక్యూర్మెంట్ టెండర్/బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు. ఈ టెండర్ కం వేలంపాటలో నియమనిబంధనలు అనుసరించి ఎవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామివారి ఊరేగింపు రథం నిర్మాణ కార్యక్రమాలకు ఆదివారం ప్రారంభించారు.

పేదలకు వైద్యం చేరువ కావాలి

మెడికల్ క్యాంపు ప్రారంభిస్తున్న ప్రసాద్

ప్రజాశక్తి-గన్నవరం : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఖరీదైన వైద్యం చేరువ కావడానికి వైద్యులు సహకరించాలని లయన్స్ క్లబ్ సీనియర్ మెంబర్ మండవ లీలాకృష్ణ ప్రసాద్ కోరారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని జాస్తి చంద్రమౌళి సేవా సదన్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నవరం ఆధ్వర్యంలో ఆదివారం మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యం చాలా ఖరీదైన వస్తువుగా మారిపోయిందని, ప్రభుత్వాలు అందిస్తున్న సహకారంతో పాటు వైద్యులు కూడా తమ వంతు సహకారం అందించడానికి ముందుకు రావాలన్నారు. ఎంతోమంది నిష్ణాతులైన వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉన్నారని, వారు సమాజ సేవకు కొంత సమయాన్ని కేటాయిస్తే మంచిదన్నారు. డాక్టర్ కు మించిన దేవుడు మరొకరు లేరని ఆయన ఉద్బోధించారు. అనంతరం మూత్రనాళాలు, కిడ్నీ శస్త్ర చికిత్స నిపుణులు, అవ్యాన్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ కు చెందిన డాక్టర్ వెంకటేష్, ఊపిరితిత్తులు, ఎలర్జీ, బి.పి మరియుషుగర్ వైద్య నిపుణులు అవ్యాన్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్, గన్నవరం కు చెందిన డాక్టర్ యూన్నీ, పిల్లల వైద్య నిపుణులు అవ్యాన్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ డాక్టర్ రోహిత్, కంటి వైద్య నిపుణులు భారతి కంటి ఆసుపత్రికి చెందిన డాక్టర్ వరుణ్, ఎముకల వైద్య నిపుణులు అరవింద్ హాస్పిటల్, గన్నవరం డాక్టర్ అరవింద్,లు రోగులకు సేవలు అందించారు. రోగులకు లైన్స్ క్లబ్ వారు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 210 మంది వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కే. శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, గ్రామానికి చెందిన పలువురు పెద్దలు పాల్గొన్నారు.

పెదపారుపూడి మండలంలో 'పల్లెబాట'

ప్రజాశక్తి-పెదపారుపూడి : పామర్రు నియోజకవర్గాన్ని సంపూర్ణ అభివృద్ధి చేసి పల్లెల్లో పేదరికం లేకుండా చేసే బాధ్యత తెలుగుదేశం పార్టీ దేనని పామర్రు తెలుగుదేశం పార్టీ ఇన్ఛార్జి వర్ల్ కుమార్ రాజా అన్నారు. ఆదివారం పెదపారుపూడి మండలంలోని వానపాముల, జెమి దెటుకుర్రు, కొర్నిపాడు, రావులపాడు గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమం పార్టీ శ్రేణులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి చేసే అభివృద్ధి పనులను, మ్యానిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు చల్సాని రమేష్ చౌదరి, గుండమునేని శ్రీనివాసరావు, కాగిత లక్ష్మీనారాయణ ,కలపాల కిషోర్ , దగాని లెనిన్ ,జెమిని బాబు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు ఏసుపాదం మృతి

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని మానికొండ గ్రామ సిపిఎం నాయకులు చింతగుంట ఏసుపాదం (63) మృతిచెందారు. ఆదివారం ఉదయం మానికొండ గ్రామంలో గల ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద విధులు ముగించుకుని సైకిల్ పై ఇంటికి వస్తూ అకస్మాత్తుగా కిందపడి ప్రాణాలు కోల్పోయారు. ఆయన మద్యం దుకాణంలో రాత్రి కాపలా దారుగా పని చేస్తూ సిపిఎం కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనే వారు. గ్రామంలో జరిగిన పేదలకు ఇళ్ల స్థలాల పోరాటాల్లో, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రుణాలు మంజూరు చేయాలని జరిగిన పోరాటాల్లో కీలక పాత్ర పోషించారు.మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏసుపాదం మృతదేహాన్ని మండల పార్టీ కార్యదర్శి అజ్జీరా వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు మేకల పార్వతీశ్వరరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

గాయకుడు ఘంటసాలకు నివాళి

గుడివాడలో...

ప్రజాశక్తి-ఘంటసాల : గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని ఘంటసాల గ్రామంలోని ప్రాచీన చిహ్నాలు ఏర్పాటు చేసిన స్థలంలో వెంకటేశ్వరరావు విగ్రహానికి మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ బాబు, ప్రముఖులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర దేశంలోనే అతి పెద్ద ఘంటసాల విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి ఇక్కడి నివాళులర్పించటం గొప్ప విషయమన్నారు. 50 సంవత్సరాలైనా ఇంకా తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం టేకుపల్లి ఘంటసాల స్వగ్రామం కావటం, ఆయన పూర్వీకులది ఘంటసాల గ్రామం కావటం మనందరి అదష్టమన్నారు. ముఖ్యంగా తెలుగుజాతికి ఒక వరం ఘంటసాల స్వరమని అన్నారు. ఘంటసాల గ్రామాభివృద్ధికి విశేష కషి చేసిన ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథబాబు ఆ కార్యక్రమంలో పాల్గొనటం గొప్ప విషయమన్నారు. ఘంటసాలలో ప్రాచీన చిహ్నాలను ఏర్పాటు చేయ టంతో ప్రముఖ పాత్ర పోషించిన జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకష్ణ అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, సోలే శ్రీను, కొండపల్లి రామకష్ణ, తాడేపల్లి ఉపసర్పంచ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుడివాడ : కర్ణాటక, హిందుస్థానీ సంగీతాల్లో ప్రావీణ్యం పొంది కచేరీలు చేసి, సంగీత దర్శకత్వం చేసిన ఏకైక వ్యక్తి అమరజీవి ఘంటసాల వెంకటేశ్వరరావు మాత్రమేనని, పాటలు రూపంలో ఎప్పటికి ఆయన చిరంజీవిగానే ఉంటారని సమాఖ్య గౌరవ అధ్యక్షులు బి.వి మోహనరెడ్డి, అధ్యక్షులు విన్నకోట సత్యనారాయణ (బుజ్జి)లు అన్నారు. ఆదివారం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక కోగంటి రాజాబాపయ్యచౌక్ వద్ద గల ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహం వద్ద ఆయన 50వ వర్ధంతిని పురస్కరించుకుని ఘంటసాల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. సమాఖ్య గౌరవ అధ్యక్షులు కోశాధికారి అత్యుకూరి సాంబశివరావు, ఉపాధ్యక్షులు లోయ రాధకృష్ణ, బి.వి సత్యనారాయణ, పాత శ్యామ్, నాగరాజు, నాగేశ్వరరావు, రమణ, భాస్కరరావు పాల్గొన్నారు.

యార్లగడ్డలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని యార్లగడ్డలోని 5 4 బూత్ల పరిధిలోని మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిం చారు. కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా తెలుగు యువత ఉపాధ్య క్షుడు క్లస్టర్ ఇంచార్జ్ మొర్ల శివ, యూనిట్ ఇంచార్జ్ దేవ భక్తుల గోపాలకష్ణ, గ్రామ అధ్యక్షులు తొట్టెంపూడి శివ పాండురంగారావు, బొబ్బ కష్టారావు పాల్గొన్నారు

20న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-అజిత్ సింగ్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 20వ తేదీన విజయవాడలో జరిగే సిపిఎం, సిపిఐ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు కోరారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 61వ డివిజన్ పాయకాపురంలోని శాంతినగర్‌లో ఆదివారం జరిగిన ప్రజా సంఘాల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపిలో నూటికి 99 శాతం ప్రజలు బిజెపిని తిరస్కరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి కేంద్రానికి దాసోహం కావడం సిగ్గుచేటన్నారు. జగన్, చంద్రబాబు, పవన్ ముగ్గురు మోడీ నాటకంలో పాత్రధారులేనన్నారు. దేశం, రాష్ట్రం బాగుపడాలంటే బిజెపి దానితో జట్టు కట్టిన వైసిపి, టిడిపి, జనసేనలను ఓడించడమే మార్గమన్నారు. బిజెపి మళ్లీ గెలిస్తే ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం అవుతుందన్నారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే వైసిపి రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్న బిజెపికి ఐదేళ్లుగా పూర్తి మద్దతు ఇవ్వటం శోచనీయమన్నారు. మోడీ పాలనలో విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టారని, మళ్లీ గెలిస్తే రాష్ట్రాన్నే అమ్మేస్తారని విమర్శించారు. కమ్యూనిస్టులు, లౌకిక శక్తులు, ప్రజాస్వామ్యవాదులు దేశం, రాష్ట్రం పరిరక్షణ కోసం గొంతు కలపాలన్నారు. శాసనసభలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు శాసనసభ ఎన్నికలలో ఉమ్మడి పోరు సాగించాన్నారు. ప్రజాస్వామ్య, లౌకిక పార్టీలు, శక్తులు సదస్సులో పాల్గొని ఉమ్మడి గళం వినిపించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బి.రమణరావు, కే. దుర్గారావు, సిహెచ్.శ్రీనివాస్, సుజాత, అరుణ, శివ పార్వతి, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రాథమిక పరీక్షకు 111 మంది హాజరు

ప్రజాశక్తి-తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ అధ్వర్యంలో ప్రాథమిక పరీక్షలు స్థానిక సర్వోదయ పాఠశాలలో శనివారం ప్రారంభం అయ్యాయి. గంపలగూడెం, విస్సన్నపేట తిరు వూరు, ఎ. కొండూరు మండలాలకు చెందిన 111 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైనట్లు పరీక్షా కేంద్ర సంచాలకులు మూర్తి తెలిపారు. హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ పర్యవేక్షించారు.

పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మాజీ ఎమ్మెల్యే సౌమ్య కార్యాలయంలో తెలుగు యువత, టిఎన్‌ఎస్‌ఎఫ్, ఐటీడీపీ ఆధ్వర్యంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ పోస్టర్ ఆదివారం విడుదల చేశారు. సౌమ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయసు నిండిన యువతీయువకులు తమ ఓట్ హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శివమ్మకు నివాళి

ప్రజాశక్తి-సింగ్‌నగర్: 60వ డివిజన్ వాంబే కాలనీ జి బ్లాక్‌లో సిపిఐ సీనియర్ నాయకులు కంచర్ల శివమ్మ (60) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.దుర్గారావు, డివిజన్ కార్యదర్శి ఎస్.కె. పీరు, ఎం.బాబురావు, సూరప్పల్, అప్పన్న సందర్శించి నివాళులర్పించారు.

దుర్గగుడికి ఆరు వేల పెన్నులు విరాళం

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడిలో ఈ నెల 14న శ్రీ పంచమి సందర్భంగా విద్యార్థులకు పెన్నులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేసే పెన్నులను గుంటూరు బృందావనం గార్డెన్స్‌కు చెందిన పద్మనాభిని జయరాం ఆదివారం ఆరు వేల పెన్నులను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనము కల్పించి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. దుర్గమ్మను టిటిడి మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

ఘనంగా శత జయంతి మహోత్సవాలు

ప్రాణశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని శ్రీ అన్నపూర్ణా సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి శత జయంతి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కాపా రామసీతమ్మ, కాపా కృష్ణప్రసాద్, కాపా రవీంధ్రనాధ్, కాపా భానుప్రసాద్ మాట్లాడుతూ స్వామి వారి సేవ చేయడం తమకు పూర్వికులు అందించి అదష్టమని వివరించారు. అలయాన్ని మరింత అభివద్ధి చేస్తామని, ప్రస్తుతం ఎటువంటి లోటు లేకుండా సుమారు రూ.35 లక్షలతో అలయాన్ని అభివృద్ధి చేశామన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాలి

ఎపి హజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ అజీమ్, ఆసిఫ్ పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న గౌసుల్ అజీమ్, ఆసిఫ్

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవటానికి ముస్లిం మైనార్టీలందరూ అండగా ఉండాలని ఏపీ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌసుల్ అజీమ్, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జమాఅతే అహ్లె హదీస్ కమిటీ రాష్ట్ర సమావేశం విజయవాడ పాతబస్తీలోని మర్కజీ జమాఅతే అహ్లె హదీస్ మసీదు ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకూ ఐదు నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీలను జగన్‌మోహన్‌రెడ్డి సీట్లు ప్రకటించారన్నారు. అలాగే రానున్న జాబితాల్లో ఇంకా ముస్లిం మైనార్టీలకు అవకాశం ఉందన్నారు. ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారం, అభివద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండదండలు అవసరమన్నారు. ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు చాలా అండగా ఉండి సహకరించిందన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర జమాఅతే అహ్లె హదీస్ కమిటీ రాష్ట్ర సమావేశం ముందుకు వచ్చిన సమస్యలను కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిష్కరించేందుకు పాటుపడతామన్నారు. అనంతరం గౌసులాజమ్ మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో షేక్ ఆసిఫ్‌ని గెలిపించేందుకు అందరూ అండగా ఉండాలని సూచించారు. ఈ సమావేశానికి సంస్థ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ఫలులుల్ రెహ్మాన్ ఉమ్రి అధ్యక్షత వహించారు. కార్యదర్శి హాఫీజ్ అబ్దుల్‌గఫ్ఫార్ ఉమ్రి, కోశాధికారి ఫారూఖ్ ఖాన్‌సాహెబ్, పాల్గొని తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో మౌలానా నసీర్ అహ్మద్ ఉమ్రి, అతేఖుర్ రెహ్మాన్‌తో పాటుగా 13 ఉమ్మడి జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కంచికచర్ల

కంచికచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు వద్ధులకు అనాధలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు స్థానిక ప్రభాకర్ క్లినిక్ లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ గుప్తా చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కంచికచర్ల లైన్స్ క్లబ్ సుమారు 19 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డాక్టర్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ లైన్స్ క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో కరోనా సమయంలో కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

వ్యాపారవేత్తలకు సరికొత్త వారధి బిఎన్‌ఐ

రాష్ట్రస్థాయి సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వ్యాపారవేత్తల నడుమ స్నేహ బంధాన్ని నెలకొల్పి, పరస్పర వ్యాపారాభివృద్ధి దిశగా అడుగులేసే లక్ష్యంతో బిఎన్‌ఐ విజయవాడ చాప్టర్ నిర్వహించిన ఏపీ నెట్వర్కింగ్ కాన్క్లేవ్ విజయవంతంగా జరిగింది. విజయవాడలోని ఎస్‌ఎస్ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన సదస్సులో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు 1500 మంది వాణిజ్య ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యాపారాన్ని విజయవంతంగా నిర్వహించడం, అవకాశాలను సృష్టించుకోవడం, వ్యాపార విస్తరణ తదితర అంశాల గురించి నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రతినిధులు ఆసక్తిగా పాల్గొన్నారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఐపిఎస్ అధికారి డాక్టర్ కిరణ్ బేడీ ప్రసంగం సదస్సుకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వినియోగదారుల సేవలు, వ్యాపార నిర్వహణలో నూతన విధానాల గురించి ఆమె చేసిన ప్రసంగం వాణిజ్యవేత్తలకు స్ఫూర్తినిచ్చింది. అంకితభావంతో కృషి చేస్తూ, వినూత్న విధానాలను అవలంభించడం ద్వారా వ్యాపారంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. వ్యాపారవేత్తలు ఒకరికొకరు సహకరించుకోవడం ద్వారా పరస్పర వ్యాపారాభివద్ధి సాధ్యమవుతుందని ఆమె తెలిపారు. బీఎన్‌ఐ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా నెట్వర్కింగ్ కీలక భూమిక పోషిస్తుందని, వ్యాపార రంగంలోనూ నెట్వర్కింగ్‌ను విస్తృతం చేయడం ద్వారా అద్భుత ఫలితాలను ఆవిష్కరించవచ్చని చెప్పారు. సదస్సు ద్వారా ఆరంభమైన అనుబంధాలను కొనసాగించేందుకు వీలుగా ప్రత్యేకమైన మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రతినిధులందరినీ అనుసంధానించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెట్వర్కింగ్ కాన్క్లేవ్ ట్రెజరర్ త్రినాథ్ నండూరి, బీఎన్‌ఐ కాన్క్లేవ్ చైర్మన్ మద్దినేని శ్రీనివాస్, ట్రెజరర్ త్రినాథ్ నండూరి, కన్వీనర్ మేఘన ఆచంట పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కిరణ్‌బేడీ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.